




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 1100 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

-5-

ఈ భాగంలో 1930 తర్వాత వచ్చిన మరికొన్ని తెలుగు పత్రికల గురించి మాట్లాడుకుందాం. ముందుగా మనం విశేషాలు తెలుసుకోబోతున్న సాహిత్య ద్వై మాస పత్రిక "జయంతి". దేశం పట్టనంత మహాకవి, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు తన 32 వ ఏటనే, ఒక ప్రామాణికమైన, విలువలున్న సాహిత్య పత్రికను నడిపారు, అనే విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. విశ్వనాథ వారు 1921 –26 మధ్య బందరు లోని ఆంధ్ర జాతీయ కళాశాలలో తెలుగు మాస్టారుగా పనిచేశారు. ఆ సమయంలో ఆ కాలేజీకి వైస్ ప్రిన్సిపాల్ గా కోలవెన్ను రామకోటేశ్వరావుగారు ఉండేవారు. ఆయన సహకారంతో, ప్రోద్బలంతో విశ్వనాథ వారి సంపాదకత్వంలో వెలువడిన సారస్వత పత్రిక పేరు "జయంతి".

మొట్టమొదటి సంచిక 1927 ఆగస్టులో విడుదల అయింది. "జయంతితే సుకృతినో రస సిద్ధా కవీశ్వరా" అని భర్తృహరి సుభాషితంలోని ఒక భాగాన్ని ఈ జయంతికి తమ ఆశయంగా చెప్పుకున్నారు. ఈ పత్రికలో ఏముంటాయి? అనేది కూడా స్పష్టంగా ఏం రాసారంటే..

"జయంతి రెండు మాసాలకి ఒకసారి వచ్చే పత్రిక. సాలు చందా 4 రూపాయలు. ఆంధ్రుల సాహిత్య, చారిత్రక, వార్తా, శిల్ప, నాటక విషయముల గురించినినీ... ఆంధ్రులకూ, ఆంధ్ర భాషకూ ఉత్తేజం కలిగించే ఇతర విషయాల గురించినినీ, వ్రాసే వ్యాసాలు ఇందులో ప్రకటింప బడతవి. ముద్రణకు వచ్చే వ్యాసాలు స్వీకరించడం గానీ, త్రోసి వెయ్యడం గానీ, ఆలోచనా సంఘం వారి ఇచ్చాదీనం. కనక వ్యాసకర్తలు, వ్యాసాల నకళ్లు ఉంచుకొని పంపడం మంచిది. మనియార్డర్లూ, ఉత్తర ప్రత్యుత్తరాలూ ఈ క్రింది చిరునామాకు "

మహారాజశ్రీ కోలవెన్ను రామకోటేశ్వరావు గారు BABL , ఆంధ్ర జాతీయ కళాశాల, బందరు, కృష్ణా జిల్లా.

మొదటి సంచికలోనే ఎటువంటి సాహితీ ప్రముఖులు ఈ జయంతిలో వ్రాసేవాళ్ళు అనడానికి ఒక ఉదాహరణ – తరవాత రోజుల్లో ఎంకి పాటలతో ప్రసిద్ధి కెక్కిన నండూరి వెంకట సుబ్బారావు గారు దీంట్లో

"కలత నిదర " అనే పేరుతో ఒక గేయం రాసారు. అదే తరవాత ఎంకిపాటల్లో ఒక భాగం అయింది "ఈరేయి నన్నొల్ల నేరవా రాజా" అనే గేయం కూడా ఈ జయంతి మొదటి సంచికలో రాసారు. విశ్వనాథ సత్యనారాయణ గారూ(సంపాదకుడు), ఉన్నవ లక్ష్మీ నారాయణ గారూ, విశ్వనాథ సత్యనారాయణ గారి సోదరులు విశ్వనాథ వెంకటేశ్వర్లు గారూ, అడవి బాపిరాజు గారూ, గుడిపాటి వెంకట చలం గారూ, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారూ ఇలాంటి ప్రముఖులందరూ కూడా వ్రాసిన సారస్వత విషయాలతో మొదటి సంచిక చాలా వైభవోపేతంగా వెలువడింది.

ఈ జయంతి పత్రిక ప్రారంభించినపుడే, ఇందులో రకరకాల విభాగాలు ఉంచాలి అనుకున్నారు. ధర్మ శాస్త్రమూ, లలిత కళలూ, వార్తా శాస్త్రమూ, చరిత్రా. రాజనీతీ, భౌతిక శాస్త్రమూ, రసాయానికి శాస్త్రమూ, ప్రకృతి శాస్త్రమూ ఇలా. అంటే.. కేవలం సాహిత్యానికి మాత్రమే పరిమితం కాకుండా విజ్ఞాన విషయాలను కూడా అందించాలనేది పత్రిక ప్రారంభించినపుడు ఆశయాల్లో వుంది.

మరి ఇన్ని విభాగాలూ విశ్వనాథ సత్యనారాయణ గారు ఒక్కరే చూడలేరు కదా!

ప్రకృతి శాస్త్రమూ, భౌతిక శాస్త్రమూ, రసాయానికి శాస్త్రామూ ఇలాంటి వన్నీ చూడాలంటే ఒక సంఘం ఉండాలి. అందుకని "జయంతి ఆలోచనా సంఘము" అని ఒక్కొక్క విభాగానికి ముగ్గురు గానీ,నలుగురు గానీ అందులో నిష్ణాతులైన వారిని అందులో ఏర్పాటు చేశారు. ఆ విషయాన్ని కూడా మొట్ట మొదటి సంచికలోనే ప్రకటించారు. వార్తా శాస్త్రము:మామిటికోటి వెంకట రంగయ్యరావు గారు, పసుమర్తి రామచంద్రరావు గారు, భౌతిక

శాస్త్రము:డా:ఎ.ఎల్. నారాయణ గారూ, డా:జయంతి చిన కామేశ్వరావు గారూ, పాతూరి పట్టాభిరామయ్య గారూ, ప్రకృతి శాస్త్రము:గోపరాజు రామచంద్ర రావుగారూ, డా:ఉప్పల లక్ష్మణరావు గారూ, పురాణం సూరి శాస్త్రి గారూ ఇలాంటి వాళ్ళందరూ ఆయా విభాగాలకు చెందిన వ్యాసాలు వచ్చినపుడు పరిశీలించి, ప్రచురణ యోగ్యం అవునో, కాదో నిర్ణయించే వాళ్ళన్నమాట.

జయంతి పత్రిక మొదటి సంచిక గురించి మాట్లాడుకుంటున్నప్పుడు విశ్వనాథ వారి ముందు మాట గురించి తప్పక తెలుసుకోవాలి.

ఆంధ్ర దేశంలో ఇన్ని పత్రికలు ఉండగా, కొత్త పత్రికలు ఎందుకు?అనే ప్రశ్నకు సమాధానం చెబుతూ.. విశ్వనాథ వారు తన ముందుమాటలో అనేకాంశాలను గురించి ప్రస్తావించారు. విశేషం ఏమిటంటే, 93 సంవత్సరాల క్రిందట ఆయన వెలుబుచ్చిన భావాలు ఇప్పటి పరిస్థితులకు కూడా సరిపోయేటట్టు ఉండడం విశ్వనాథ వారి దూర దృష్టిని చూపిస్తుంది. అందులో కొన్ని విషయాలు చూద్దాం. అప్పటి నవలల గురించి –"ప్రస్తుత నవలల్లో సంస్కరణ జరగాలి. మన నవలలు వంగీయుల ఆంధ్రీకరణలు. కొన్ని ఆచారాలూ, వ్యవహారాలూ సమానంగా ఉన్నప్పటికీ జీవిత నిగూఢ ఉద్రేకాలలో సాటువ లేదు. వాళ్ళ ప్రకృతిలో భక్తి పాళ్ళు ఎక్కువ. భక్తి అంటే స్త్రీ ప్రకృతి. జ్నానము అనేది పురుష ప్రకృతి. స్త్రీ ప్రకృతి ఎక్కువగా ఉండడం కవికి మెరుగు. మేం దానిని అనుసరిస్తాం అంటారు కొందరు. నాటక రచనల్లో సంస్కృత వాఙ్మయం లాగా, నవలల్లో పాశ్చాత్త వాఙ్మయం ఆదర్శం కాదగ్గదేమో? (అంటే, పాశ్చాత్త నవలలను అనుసరించి, తెలుగులో నవలలు రాయడం తప్పులేదు.అని మొట్ట మొదటి సంచికలోనే విశ్వనాథ వారు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.) మన నవలకు ఇది లక్షణం అయింది. నెలకి ఒక నవల. కొంచెం భాషా పరిచయంగల వాళ్ళు ఎప్పుడూ డబ్బు ఇబ్బందే కనక. ఆయన రాస్తే వంద రూపాయలు ఆ పైన టెక్స్ట్ బుక్ కమిటీ వారు అనుగ్రహిస్తే, మరి నాలుగు పైసలు. భావ కవిత్వం తప్ప, తక్కిన వాటికన్నిటికీ ఇదే దశ పట్టింది. ఫలాపేక్ష లేకుండా సృష్టించిన శిల్పం, సర్వోత్కృష్టంగా ఉంటుందని వూహ."

అలాగే ఇంగ్లీష్ చదువుకున్న వాళ్ళు, తెలుగుని తక్కువగా చేసి చూడడం, తెలుగు సాహిత్యాన్ని తక్కువగా చేసి చూడడం, మన ప్రాచీన సాహిత్యాన్ని సరిగ్గా ఆదరించక పోవడం, విషయాల్ని గురించి రాస్తూ ఆయన అన్నారు.

" దేశంలో చదువుకున్నవాడు అంటే.. ఇంగ్లీష్ చదువుకొన్న వాడే. అతనికి కీట్స్, షెల్లీ, షేక్స్పియర్ పరిచయం ఉన్నంతగా పోతనా, తిక్కనా, పెద్దనా పరిచయం లేదు. కానీ ప్రకృత కవిత్వం అంటే, ప్రస్తుతం వున్న కవిత్వాన్ని ఆదరించాల్సినది అతనే. ఇంకా నేటి పండితులు వాళ్లకి తెలుగు మీద కన్నా సంస్కృతం మీద గౌరవం. ఏదైనా కొత్త త్రోవ అంటే, అట్లా పూర్వం ఉండాలి. ఇప్పుడది రైటు. కావ్యానికి మొదట మూడవ కంటి మంట ఉంటే అశ్లీలం. పూర్వ కవి ఇట్లాగే వర్ణించాడు అంటే, ఒప్పుకుంటారు. స్వేచ్ఛా, లౌకిక జ్ఞ్యానం చురుకుదనం సాధారణంగా

ఇవన్నీ రాజభాషని ఆశ్రయించి ఉంటాయి.  ఆ రాజభాష మన మాతృభాష కాకపోవడం వల్ల ఇట్లా వుందని కొందరూ, 'ఇంగ్లీష్ చదివిన వారికి భాషా ప్రయోగ పద్ధతులు తెలుసు. పూర్వ మార్గాలూ, జాతి సత్వాలు తెలుసు. ఇవి న్నంగా నడిచినన్నాళ్లు ఇంతేన'ని కొందరు. మన వాళ్లకు ప్రాచీనతను గురించి బాగా తెలుసు. 'పూర్వ ఆధునిక కవులు ఇతర దేశ ఆధునిక కవులతో తూగలేరు' అని కొందరి ఉద్దేశ్యం. "కవిత్వం దేశ, కాలాలను అనుసరించి, పుడుతుంది" అంటారు. షేక్ స్పియర్ తెలుగు దేశం లోనూ, తిక్కన ఇంగ్లాండ్ లోనూ పుట్టడం ప్రకృతి ధర్మం కాదేమో?ఎక్కడైనా కవులు కొద్దిమందే. వారిలో శక్తి ఉంటుంది. అది తెలుసుకుంటే, కొత్త శక్తి వస్తుంది. ఆంధ్రులకు కూడాను.  అసలు మన దేశం అస్వాతంత్రంలో వుంది అంటే మన భాష ఈ స్థితిలో ఉండడమే కారణం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ ప్రధాన భాష అయితే, ఆంధ్ర విశ్వవిద్యాలయం లో తయారైన విద్యార్థులు ఆంగ్ల భాషాభిమానులే అవుతారు. "కవిత్వం ఎప్పుడూ సంఘ, మత,ఆచారాలను రమ్యంగా హృదయకరంగా చెబుతుంది" అంటారు. కవిత్వం చదవడం తోటే ఆ సంఘ మతాచారాల యందు అమిత ఇష్టం ఉంటుంది. మన మతం కన్నా ఏ మాత్రం సంస్కారం వున్నా తక్కిన మతాలు సులభంగా అర్ధమవుతాయి. ఒకటి బాగా జీర్ణించుకున్న తర్వాత, రెండో దానిమీదికి ఎంతో ఆలోచనాపరుడికి పోదు. షెల్లీనీ, షేక్స్పియర్ నీ చదివిన తర్వాత, "ఛీ! మనవాళ్లేమిటి?" అనిపిస్తుంది. వాళ్ళ దేశం అన్నా, వాళ్ళ సంఘ ఆచారాలన్నా అభిమానం కలుగుతుంది. అలా కాకుండా తిక్కనా, పోతనా లను ఇక్కడే యెరిగి ఉంటే, ఆ అభిమానం ఇక్కడే ప్రవహిస్తుంది.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థులందరూ షేక్స్పియర్, షెల్లీలలాగా తిక్కనా, పోతనాల పట్ల గౌరవం కలవాళ్ళయి, వీళ్ళ శిల్పం అట్లా తెలుసుకుంటే, మరు నిముషం  'మా తిక్కన ఇంతటి వాడు' అని ఇతర దేశాల వాళ్లకి చూపిస్తారు వాళ్ళే. కార్లే దొరని  ఎవరో అడిగారట "ఒకవేళ వదిలిపెట్టాల్సి వస్తే, హిందూ దేశం వదిలిపెడతావా? షేక్స్పియర్ ని వదిలిపెడతావా?"అని. ఆయన "హిందూ దేశాన్నే వదిలేస్తాను" అన్నాడట. అది సారస్వతమంటే రుచి. అదే ఇప్పటి ఆంధ్రుడ్ని అడిగితే ఏమంటాడు "తిక్కననే వదిలేస్తాను " అంటాడు.

స్వాతంత్రం అంటే ఏమిటి? సంఘ, మత ఆచారాల్లో వ్యవస్థ ఉండడం. వ్యక్తిత్వం చావకుండా చూసుకోవడం. ఈ సంఘ,మత ఆచారాలకు ప్రధాన ధ్వజ స్థంభం సారస్వతం. ఆ సారస్వతాన్నే ఎండగడితే, చైతన్యం పోతుంది. అందువల్ల సారస్వతాన్ని గౌరవించండి. "అని చెప్పారు.

చిట్ట చివరి మాటలు ఏం రాశారో చూడండి. ఇప్పటికైనా యధాతధంగా వర్తిస్తాయి.

"ఏ జగత్తు కైనా జీవితానికయ్యే భాషే పరిగ్రాహ్యం. ఇక మన దేశం బాగుపడాలంటే, తెలుగు భాషే జీవితానికయ్యే భాష కావాలి. తక్కినవన్నీ తరువాత." ఇది 1927 లో చెప్పిన పచ్చి నిజం అనుకోవచ్చు.

విశ్వనాథ వారు రాసిన "కోకిలమ్మ పెళ్లి", కిన్నెర నడకలు, కిన్నెరసాని పాటలు ఇలాంటి ముఖ్యమైన రచనలన్నీ కూడా ఈ జయంతిలోనే వచ్చాయి. ఆయన రాసిన కోకిలమ్మ పెళ్లి చాలా సరళంగా, లలితంగా సాగిపోతూ ఉంటుంది. . ఉదాహరణకు: లేత బుర్రలు కొక్కిరిస్తే, ఆటగాళ్ళతో ఏమి గానీ, తాత కతలు తవ్విపోస్తానోయ్! వూగులాడే కడలి తరగలు నాగుబాములలా కోడెలల్లే బొద్దుదాకా పాకి పాకి నురగ తరగల ఊగులాడే గాలి చేత వూగుతుంటాయోయ్! అడవిలోనూ, కడలిలోనూ అర్ధరాత్రి వేళలప్పుడు తొగరుకన్నుల కన్నెలు తొంగి చుస్తారోయ్!"
, ఆ తరువాత వచ్చిన సంచికల్లో కూడా విశ్వనాథ వారి ఉత్తమ కవితలు అని ప్రశంచబడిన అనేక కవితలు ఈ జయంతి పత్రికలో వచ్చాయి.

అట్లాగే.. జయంతి తరవాత సంచికలో బ్యాటరీ ఎలా పనిచేస్తుంది? లాంటి ఫిజిక్స్, కెమిస్ట్రీ కి సంబంధించి నటు విషయాల్ని కూడా రాసారు.

జయంతి మొదలైన 5,6 నెలలకే కోలవెన్ను రామకోటేశ్వరావు గారు 1928 జనవరి లో "త్రివేణి"పత్రికను ఆంగ్లం లో ప్రారంభించారు. ఆ విశేషాలు మనం క్రిందటి భాగంలో తెలుసుకున్నాం.

జయంతి పత్రిక వెలువడిన ఆ సంవత్సరాల్లో అంటే, 1927, 28,29 ఆ సంవత్సరాల్లో విశ్వనాథవారు ఆయన ఎప్పుడో వదిలేసిన B.A డిగ్రీని పూర్తి చేయడం, అలాగే M. A . కి కూడా పరీక్షలు రాయడం, ఏకవీర నవల పూర్తి చేయడం, ఇట్లాంటివి వన్ని జరిగాయి. మిగతా సాహిత్య పత్రికల్లాగా అంత లాభ సాటి వ్యవహారం కాదు కాబట్టి, జయంతి పత్రిక కూడా 2,3 సంవత్సరాల మించి కొనసాగలేదు. వచ్చినన్ని రోజులూ మాత్రం అత్యంత సాహిత్య విలువలతో వెలువడింది. అది – 1930లో మొట్ట మొదటి సారిగా విశ్వనాథ సత్యనారాయణ గారి సంపాదకత్వం వెలువడిన జయంతి పత్రిక మొదటి మజిలీ.

ఆసక్తి కరమైన విశేషం ఏమిటంటే 1930 లో ఆగిపోయిన జయంతి పత్రిక మళ్ళీ 28 సంవత్సరాల తర్వాత విశ్వనాథ వారి సంపాదకత్వం లోనే ఈ సారి హైదరాబాద్ నుండి వెలువడింది. ఈ జయంతి రెండో సారి వెలువడే సమయానికి విశ్వనాథ వారు దేశం పట్టనంత మహా కవిగా పేరు తెచ్చుకోవడమే కాదు, అసంఖ్యాకమైన అభిమానుల్ని సంపాదించుకున్నారు.

1958 లో రెండవసారి వచ్చిన"జయంతి"పత్రిక అందులో ఏం వుందో చూద్దాం.

1958 జనవరిలో విడుదల అయ్యింది. దాంట్లో మంజుశ్రీ, నాయని సుబ్బారావు, మునిమాణిక్యం సుబ్బారావు, వేటూరి ఆనంద మూర్తి గారు, శ్రీపాద రేణువు గారు, సోమసుందర్ గారు, విశ్వనాథ సత్యనారాయణ గారు రాశారు. ఈ జయంతి సంచిక హైదరాబాద్ నుండి వెలువడి నప్పుడు "సంపాదక మండలి " ఏర్పాటు చేశారు.

దానికి విశ్వనాథ వారు అధ్యక్షులు. మల్లంపల్లి సోమశేఖర శర్మ గారూ, దివాకర్ల వెంకట అవధాని గారూ , కేతవరపు రామ కోట శాస్త్రి గారూ, జువ్వాడి గౌతమరావు గారూ వీళ్లంతా ఆ సంపాదక మండలిలో సభ్యులు.

రెండవసారి వచ్చిన జయంతి పత్రికకు కూడా మొదట రాసిన భతృహరి సుభాషితాన్నే తమ ఆశయంగా చెప్పుకున్నారు. రెండవసారి కూడా జయంతి పత్రిక 3,4 సంవత్సరాల మించి కొనసాగలేదు.

అయితే, జయంతి మాసపత్రిక చరిత్ర 1958 తో ముగింపుకు రాలేదు. 2003 సెప్టెంబర్ లో విశ్వనాథ వారి జయంతి సందర్భంగా హైదరాబాద్ నుండి మళ్ళీ మొదలైంది. ఇది మూడవసారి. ఈసారి మూడునెలలకి ఒకసారి. "విశ్వనాథ సాహితీ పీఠం "అని ఒక సాహిత్య సంస్థ తరపున వెలిచాల కొండలరావుగారి సారధ్యంలో వెలువడింది. ఆ సంచికలో ఏముందో చూద్దాం.

జయంతి త్రై మాస పత్రిక సెప్టెంబర్ 2003 నుండి ఫిబ్రవరి 2004 వరకూ అని రాసారు. ముఖ్య సంపాదకులు జువ్వాడి గౌతమరావు గారు. ఈయనే జయంతి రెండవసారి వెలువడినప్పుడు విశ్వనాథ వారి సంపాదక మండలిలో సభ్యులుగా వున్నారు. సహాయ సంపాదకులుగా ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య గారూ, తుమ్మపూడి కోటేశ్వరావు గరూ వున్నారు. "సిస్టర్ నివేదితా ఫౌండేషన్"అనే పేరుతో ఈ జయంతి సాహిత్య పత్రిక మూడవసారి వచ్చింది. ఈ సంచికలో ఎక్కువగా విశ్వనాథ సత్యనారాయణ గారి గురించిన వ్యాసాలే వున్నాయి.

"కవి సామ్రాట్ "అని గుంటూరు శేషేంద్ర శర్మ గారూ, "అదీ విశ్వనాథ వారంటే.. "అని డి. వి. నరసరాజు గారూ, "మా మాస్టారు గారు" అని తుమ్మపూడి కోటేశ్వరావు గారూ, " అపరిణామ ప్రాప్తము " అని విశ్వనాథ సత్యనారాయణ గారి కుమారుడు విశ్వనాథ పావని శాస్త్రిగారు – వీళ్ళందరూ కూడా ఇందులో వ్యాసాలు రాశారు. జయంతి మాస పత్రిక మూడవసారి వచ్చినపుడు అప్పటి తమిళ నాడు గవర్నర్ గా వున్న పి.ఎస్. రామ్మోహనరావు గారు ఒక అభినందన పత్రం పంపించారు. అందులో ఏం రాశారంటే...

"విశ్వనాథ సాహిత్య పీఠం" అనే సాహిత్య సంస్థను స్థాపించారని తెలుకోవడానికి చాలా సంతోషంగా వుంది. సంస్థ ముఖ్య ఉద్దేశ్యాల్లో ఒకటైన జయంతి త్రై మాసపత్రికను విశ్వనాథ వారి జన్మదిన సందర్భంగా ప్రారంభించడం, ముదావహం. ఈ సందర్భంగా యాదృచ్ఛికంగా ఒక యదార్ధ విషయం. విశ్వనాథ వారూ, నేనూ ఒకే ఊరి వాళ్ళం. దానికి పైన విజయవాడ S R R C V R కాలేజీలో తెలుగు అధ్యాపకులుగా విశ్వనాథ వారు నాకు గురువు. మా తండ్రిగారికి సమకాలీనులు. కాబట్టి, ఆయన స్మృత్యర్థం ఒక త్రై మాస పత్రికను ప్రారంభించడం, విశ్వనాథ వారికే కాక, తెలుగు సాహిత్యానికే సేవ చేసినట్లవుతుంది. ....... మీ... పి. ఎస్. రామ్మోహనరావు గవర్నర్, తమిళనాడు.

అలాగే ఈ మూడవసారి ప్రారంభమైన జయంతి ప్రారంభమైన మొదటి సంచికలో విశ్వనాథ వారి అరుదైన ఛాయా చిత్రాలు ప్రచురించారు. ఇలా జయంతి మాస పత్రిక 1927 లో ప్రారంభమయి, ఆ తరువాత రెండు

విడతలుగా 1958, 2003 లలో పునః ప్రారంభమయింది. అన్ని సంచికలు కూడా భర్తృహరి సుభాషితాన్ని మకుటంగా వాడడం గమనార్హం.

1999 లో "జయంతి" అనే పేరుతో ఇంకో మాస పత్రిక వచ్చింది. దీనికీ, విశ్వనాథ వారికీ సంబంధం లేదు. రచయతలకోసం రచయితలే నిర్వహిస్తున్న పత్రిక అనే నినాదంతో ఆనాటి పాపులర్ మ్యాగజైన్స్ ధోరణిలో వచ్చింది. ఆ జయంతి మాస పత్రిక కూడా ఎక్కువరోజులు కొనసాగినట్లు లేదు.

★★★

తరువాత 1930 ప్రాంతాల్లోనే మొదలై, కొద్ది సంవత్సరాలు నడచి ఆగిపోయిన పత్రికలు వాటి ప్రత్యేకతల గురించి తెలుసుకుందాం. వీటిలో చాలా పత్రికల గురించి, ఈ తరంలో చాలా మందికి తెలిసి వుండకపోవచ్చు. ఎందుకంటే అవేవీ కూడా 5,10 సంవత్సరాలు మించి కొనసాగలేదు. అయినా గానీ ఈ పత్రికలకు వున్న ఆసక్తికరమైన నేపథ్యం అవి చేసిన విలక్షణమైన కృషి, వీటివల్ల ఆ పత్రికల విశేషాలు మీ ముందుకు తీసుకువస్తున్నాను.

ఈ క్రమంలో నేను పరిచయం చేస్తున్న పత్రిక "ఆనంద వాహిని".

1930 లలో ప్రారంభమైన ఈ పత్రిక ఏడాది మించి కొనసాగలేదు. కాకపోతే, వివిధ కోణాల్లో ఈ ఆనంద వాహిని మాస పత్రికకు ప్రత్యేకతలు వున్నాయి. పరిశోధనా పరమేశ్వరుడుగా పేరుతెచ్చుకున్న వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఒక పత్రికకు సంపాదకుడిగా పనిచేసారు అన్న విషయం చాలా మందికి తెలిసి ఉండక పోవచ్చు. ఆయన గురించి వ్రాసిన వ్యాసాల్లో కూడా వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఒక పత్రికకు సంపాదకత్వం వహించారు అని ఎక్కడా కనిపించదు. కారణం ఈ పత్రిక అతి తక్కువ కాలం రావడం. పైగా వేటూరి ప్రభాకర శాస్త్రి గారి పాండిత్యంగానీ, ఆయన పరిశోధనాశక్తి గానీ, ఈ పత్రికలో ప్రతి బింబించక పోవడం కూడా అయివుండొచ్చు. ఆ పత్రికే "ఆనంద వాహిని".

బహుశా ఈ ఆనంద వాహిని అనేది తెలుగులో తొలి హాస్య పత్రిక అయివుండొచ్చు. ఇందులోని అంశాలన్నీ కూడా కేవలం హాస్యం కోసం ఉద్దేశించబడినవే. సాహితీ వ్యాసాలు గానీ, పద్యాలు గానీ రాజకీయ వార్తలు ఇలాంటివి ఏవీ ఉండేవి కాదు. ఒకటీ, అరా వార్తా ఖండికలు ఉన్నప్పటికీ హాస్య స్ఫోరకం గానే, వ్యంగ్యంగానే రాస్తూండేవారు. ఇంకా ఆసక్తికరమైన విశేషం ఏమిటంటే, ఈ ఆనంద వాహిని పత్రిక, అప్పటికే తమిళం లో పేరు తెచ్చుకున్న "ఆనంద వికటన్" స్ఫూర్తి తో ప్రారంభం కావడం. జెమిని వాసన్ ఆనంద వికటన్ పత్రికను కొని, కొత్త రూపు ఇచ్చి, ప్రాచుర్యం లోకి తీసుకురావడం అదంతా ఒక చరిత్ర. ఆసక్తి గలవారు నా టాక్ షో చూడవచ్చు.

వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఆ రోజుల్లో మద్రాస్ లో ఓరియంటల్ లైబ్రరీ లో పని చేస్తుండేవారు. ఆయనకు తమిళ భాషకు చెందిన రచయితలతో చక్కని పరిచయాలు ఉండేవి. ఆ క్రమం లో జెమినీ వాసన్ గారు "తెలుగులో

కూడా ఆనంద వికటన్ పత్రికను తీసుకువస్తే బాగుంటుంది" అని వేటూరి ప్రభాకర శాస్త్రి గారితో దానికి శ్రీకారం చుట్టించారు. దాని ఫలితమే ఈ ఆనంద వాహిని అనే మాస పత్రిక. మొట్ట మొదటి సంచిక 1930 జనవరి ఒకటిన మార్కెట్లోకి వచ్చింది.

వేటూరి ప్రభాకర శాస్త్రిగారి పేరు సంపాదకుడిగా ఉండేది కాదు. కానీ, అందరికీ తెలుసు ఆయనే సంపాదకుడు, ప్రారంభించి నడుపుతున్నారు అని. ఈ తొలి సంచికలో "స్వవిషయము"అని సంపాదకీయంలో ఇలా రాశారు.

"నిర్మలమైన ఆనందం గానీ, నిర్మలమైన జ్ఞానం గానీ, నిర్మలమైన సత్యం గానీ ఈ లోకంలో దొరకవేమో? అని అధైర్య పడినంతగా అలజడి వీటివల్ల ఏర్పడి వున్నది. ఈ అలజడిలో, ఈ మథనంలో అమృతమూ పుడుతోంది, హాలాహలమూ పుడుతోంది. మంచీ వుంది. చెడూ వుంది. ప్రతి మానవుడూ ఈ ద్వంద్వ యుద్ధంలో నలిగిపోతున్నాడు. తెప్పరించుకోవాలి అనే కోరికతో, కొట్టాడు తున్నాడు. కానీ, వెన్ను చూడలేని కన్ను, కన్ను చూడగలిగినంత దూరంలో వున్న వాటి మాట నైనా వినలేని చెవి, మరు నిముషంలో రానున్నదానిని గుర్తించలేని మనసు, వీటితో మానవ మాత్రుడు ఏమి శాంతిని పొందగలడు. "

అంటే ఆ రోజుల్లో ఉన్నటువంటి మానసిక అశాంతిని, వీటన్నిటినీ కూడా ఆయన ప్రస్తావిస్తూ ఇలాంటి వాటికీ విరుగుడుగా ఈ హాస్య పత్రికను తీసుకువస్తున్నాము అని తరవాత వాక్యాల్లో చెప్పారు.

"ప్రజా బలమును గుర్తించి, సంఘ శక్తిని సంధానించి, కార్య నిర్వాహమును పురి కొల్పుటకుగాను, సంఘ ఉద్యోగ వర్గము అన్నట్లుగా ప్రపంచమంతటా ఇప్పుడు పత్రికలు పనిచేస్తున్నవి. ప్రపంచ వ్యవహార తంత్రం అంతా ఇప్పుడు పత్రికల మూలమున జరుగుతున్నది. జ్ఞానామృతమంతా ఇప్పుడు పత్రికల మూలమున ప్రవహిస్తున్నది. వర్తమాన కాలమున , పత్రిక ప్రచారము నిలిపితే, ప్రపంచ వ్యవహారము సాగడం కష్టమవుతున్నది. ఒక్కొక్క దేశంలోనూ, ఒక్కొక్క భాషలోనూ పత్రికలు దినదినమూ ప్రకటితమవుతున్నవి. జ్ఞానమున విరాజిల్లుతున్నవి.

అట్టివి తెలుగుదేశంలో కూడా చాలా వున్నాయి. వాటివల్ల దేశానికీ మహోపకారము జరుగుతున్నది. కానీ, చదువు నేర్చుకున్న జనులందరూ , చదువుకునేటందుకు, పేద జనులందరూ చదువుకునేటందుకు, పెద్దపెద్ద తెలివితేటలు లేని సామాన్యు లందరూ చదువు కునేందుకు, ఆనందముగా చదువుకునే టందుకు, చదివి పారవేయకుండా, దాచుకొని మళ్ళీ మళ్ళీ చదువుకుని, సంతోషిస్తూ ఉండేటందుకు వీలుగా మాములు వాడుక భాషతో, కారు చౌక చందా సొమ్ముతో, చిన్న చిన్న విషయాలతో అందరికీ తెలిసే విషయాలతో, హాస్య సంతోష ప్రసంగాలతో, అందమైన బొమ్మల అలంకరింపులతో పుస్తకములుగా వచ్చే నెల పత్రికలు తెలుగుదేశమున తక్కువగానే యున్నవి.

మలయ దీవులలో,బర్మాలో అంటే మలేషియాలో అంటే ఇతర దేశాల్లో కొంచెం కొంచెం చదువు నేర్చుకున్న తెలుగు వాళ్ళు ఎందరో వున్నారు. వారికీ కూడా తెలుగుదేశం లోని కూలీ, నాలీ వ్యవసాయం మొదలగు పనిపాట్లు

జరుపుకునే వారికి, పెద్దలకే కాదు, వాళ్లకి కూడా ఉపయోగపడాలనే తలంపుతో ఇప్పుడు ఈ “ఆనంద వాహిని”ని ఆరంభించాము. ఈ పత్రిక హాస్య ప్రధానంగా ఉంటుంది. ఇందులో ఎవరినీ నిందించడం ఉండదు. ఎప్పటికప్పుడు లోకంలో స్వదేశం లో జరుగుతున్న అపూర్వ విషయములే ఇందులో నవ్వులాటలతో వెల్లడించడమవును.

చిన్న చిన్న కథలూ, కబుర్లూ, మంచి మాటలూ , పాటలూ, పద్యాలూ ప్రకటిస్తాము. ఇది కాంగ్రెస్ పత్రిక కాదు. జస్టిస్ పత్రిక కాదు. బ్రాహ్మణ పత్రిక కాదు. ఆదిమాంధ్ర కాదు. ఏదీ కాదు.కానీ, అన్ని అవును. అందరి పత్రిక అవును. అందరికి అందుబాటులో ఉండడం కోసం చందా సంవత్సరానికి ఒకటికి ఒక్క రూపాయి మాత్రమే పెట్టినాము. ఆంధ్ర జన మహా జనులందరూ చందా దారులుగా తోడ్పడవలసినదనీ, ఆనందపడు విషయములు వ్రాసి ప్రకటనలు కూడా పంపి సహాయపడవలసినదని వేడు కుంటున్నాము.“

ఇది మొట్ట మొదటి సంపాదకీయంలో వ్రాసింది.

మొట్టమొదటి సంచిక “ఆనంద వాహిని” మొట్ట మొదటి వాక్యం నుండి చిట్టా చివరి వాక్యం వరకూ అన్ని కూడా వేటూరి ప్రభాకర శాస్త్రి గారే వ్రాసారట. కొన్ని ఆయన పేరు తోటీ, కొన్ని మారు పేరు తోటీ. కొన్నిమో అసలు ఏమీ పేరు లేకుండానూ. మొత్తం ఆయనే రాశారు. హాస్యాన్ని అందించడానికి ఆయనచూపించిన వైవిధ్యం చాలా ఆశ్చర్యం వేస్తుంది.

“చందా కట్టండి” అంటూ ప్రకటన కూడా ఎంత హాస్యంగా రాసారో చూడండి. “ఆనంద వాహిని మీ దగ్గరకు వస్తే, దాన్ని ఇదేదో మాదిరి ప్రతి. ఎవరో పంపగా రాస్తూ మన దగ్గరకు వచ్చింది అని పంపకండి సుమా! మీ కుటుంబం అంతా ఎప్పుడూ ఆనందంగా ఉండాలనే తలంపుతో ఈ ఆనంద వాహిని మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తూ ఉంటుంది. కాబట్టి, వృధాగా మనదగ్గరకు వస్తుంది అని మాత్రం అనుకోకండి. అది మీదగ్గరకు వచ్చి అడగడం ఏమిటంటే, సంవత్సరానికి ఒక రూపాయి మాత్రం అడుగుతుంది. “

వేటూరి ప్రభాకర శాస్త్రి గారు చాలా పండిత పుత్రులు ఆయన ఎంతో పరిశోధన చేసి, ఎన్నో వ్యాసాలూ, ఎన్నో సారస్వత వ్యాసాలూ రాశారు, ఆయన కూడా ఇంత సరళమైనటువంటి హాస్యాన్ని, ఎన్ని విధాలుగా రాసారు అనేది ఈ మొదటి సంచిక చూస్తే తెలుస్తుంది. అందులో కొన్ని విషయాలు చెబుతాను.

“మాయానందం”అసలు ఈ ఆనంద వాహిని ఎలా ప్రారంభం అయింది, అనేదాన్ని కూడా ఆయన ఇలా చెప్పారు.

“ఆనందం మా అబ్బాయి. ఇప్పటికి 5 ఏళ్ళ క్రిందట అరవదేశంలో వాడు పుట్టాడు. (ఆనందం అంటే “ఆనంద వికటన్ “ అన్నమాట.) వేడుకలూ, వేళాకోళాలూ, నవ్వులాటలూ మా ఆనందం పుట్టుకకు మునుపే పుట్టినవి. ఆ గర్భ హాస్యగాడు వాడు. వాడి ఆనంద హాస్యాలు విని అరవ సోదరులందరూ వాడికి “ఆనంద వికటం”అని

నామకరణం చేశారు. ఆనంద వికటన్ పేరు వినని వారూ, వాడి హాస్యాలు ఎరగని వారూ, అరవ దేశంలో లేరు. 5ఏళ్లలోనే అంత అసాధ్యుడైనాడు. (ఇది 1930లో ప్రారంభం అయింది కదా! ఆనంద వికటన్ పత్రిక తమిళం లో 1926 లో ప్రారంభం అయ్యాక, తరువాత 1928 ప్రాంతాల్లో జెమినీ వాసన్ గారు కొనుక్కున్నారు. ఇప్పుడు ఈ ఆనంద వాహిని ఎందుకు వస్తోంది అనే విషయం చెబుతూ) తెలుగుదేశంలో కూడా తిరుగుతాను. తీసుకుని వెళ్ళండి అంటున్నాడు ఈ ఆనందం. "నేర్పు ఉంటే, తిరుగు నాయనా! ఖర్చులిస్తాను"అన్నాను. మా ఆనందం ఇప్పుడు ఆంధ్రదేశ సంచారం ఆరంభిస్తున్నాడు. పేరు ఆనందం అయినట్లు, వీడి నడవడిక కూడా ఆనందం గానే వుంటుంది. వేళాకోళాలు చేస్తాడనీ, వెక్కిరిస్తాడనీ వీడి మీద మీరు కోపగించుకోవద్దు. "

అంటే, "ఆ ఆనంద వికటన్ పత్రిక స్ఫూర్తి తో ఈ తెలుగు పత్రిక ప్రారంభిస్తున్నాను" అని చెప్పారు.

మామూలుగా వచ్చిన వార్తలు కూడా ఎంత హాస్యంగా రాశారంటే ఆయన " ఈ మధ్య నెల్లూరులో బ్రాహ్మణేతర మహాసభ జరిగింది. బ్రాహ్మలను ఆ పార్టీలో చేర్చుకోవడమా, మానడమా ?అనే విషయంలో వాద ప్రతివాదనలు జరిగాయి. చేర్చుకోవల్ల కాదని తీర్మానం అయింది. నిజంగా మన పక్షం జస్టిస్ పక్షం అనిపించుకోవాలంటే, మన మధ్య ఉండి, అటు బ్రాహ్మలని, ఇటు మాలల్ని రెండు చేతులతో ఈడ్చుకొని మనలో కలుపుకోవాలి. అంతా ఒకటి కావాలి. అంతే గాని, బ్రాహ్మలని దూరంగా ఉంచడం మంచిది కాదు. వాళ్ళు ఎట్లాగూ తెలివిగల వాళ్ళు. మనం అవమానించడానికి చేసిన చేసిన పనిని అనుకూల పద్ధతికి తిప్పుకోగలరు. తప్పించుకోగలరంటున్నారని కొందరు "

ఈ ఆనంద వాహిని చూస్తుంటే ఒక ఆసక్తికరమైన విషయం కనిపించింది. ఇందులో ప్రకటనలు. విచిత్రమైన వస్తువుల యొక్క వ్యాపార ప్రకటనలు కనిపించాయి. గతంలో జెమినీ వాసన్ గారు ఆయన మొదటి రోజుల్లో మద్రాస్ ఓడరేవులో కొన్ని వస్తువులు కొనుక్కొని వాటిని vpp లో తమిళ దేశంలో అన్ని చోట్లకి పంపించేవాళ్ళు. బహుశా ఆ వ్యాపారం అప్పటికి కూడా కొనసాగుతున్నదేమో.. ఆ ప్రకటనలు ఏమిటంటే.. ఉదాహరణకి 130 వస్తువులుగల జర్మనీ పెట్టె. అందులో ఏమేమి ఉన్నాయో రాసారు. అది రెండు రూపాయల 12 అణాలట. దాంట్లో ఏమున్నాయంటే.. 14 కేరట్ల అందమైన పాళీ గల ఫౌంటెన్ పెన్నూ, నానారకముల కలములు 6. శ్రేష్టమైన పాళీలు 12. మనీ పర్సు ఒకటి. జర్మనీ సిరా బుడ్డి ఒకటి. ఇంటివన్ని కలసి రెండు రూపాయల పన్నెండు అణాలకి అందిస్తాము" అని రాసారు.

వాసన్ ఇలాంటి వ్యాపారాలే చేసి, చేసి ఆ తరువాత ఈ "ఆనంద వికటన్ "కొన్నారు. ఆ తరువాత సినిమాల్లోకి వెళ్లారు.

ఇంకా ఇలాంటి ప్రకటనలు పత్రికలో వున్నవి. "మాయ సిరా".

"ఎవరికీ తెలియనంతగా ఉత్తరములు రాసుకోవాలంటే, ఈ సిరానే ఉపయోగించవలెను. వ్రాసిన పిదప ఎవరి చేతనూ చదువుటకు సాధ్యము కాదు. అటుల చదువవలెనంటే, ఆ సిరాతో కూడా పంపబడు పద్ధతిని అనుసరించవలసింది. ఒక బుడ్డి సిరా 12 అణాలు."

అంటే, ఆ సిరాతో రాస్తే కనిపించదట. వాళ్ళేదో చెబుతారు. ఆ పద్ధతిని అనుసరిస్తేనే ఆ రాసింది చదవొచ్చు. మిగతా వాళ్లకి అది అర్థం కాదు.

అలాగే "14 కేరట్ల బంగారం పాళీ కలిగి, 3 రూపాయల వెల గల ఫౌంటెన్ పెన్ను ఉచితం చిన్న సైజు కుట్టు యంత్రము. రోల్డు గోల్డు రిస్టు వాచీ. అందమైన పట్టు ఉత్తరీయములు. మహాత్మా గాంధీ బనియనులు."

ఇలాంటి ప్రకటనలు అన్ని కూడా ఈ ఆనంద వాహిని లో వున్నాయి. ఇవన్నీ చూస్తే తెలుస్తుంది. ఖచ్చితంగా ఇది ఆనంద వికటన్ పత్రికకు అనుబంధంగా వచ్చిందని. అందుకనే s.s . వాసన్ గారి వ్యాపార ప్రకటనలు కూడా ఇందులో వున్నాయి అని.

అలాగే ఇందులో కొన్ని జోక్స్ కూడా వేటూరి ప్రభాకర శాస్త్రిగారు రాసినవే.

అందులో ఒకటి. రెండు మాత్రం ప్రస్తావించుకుందాం. భర్త "ఇంకా వంట కాలేదు. కాకుంటే నేను హోటల్ కి వెళతాను." అంటే.. భార్య అంటోంది.. " 10 నిముషాలు ఓర్చుకోండి. "అంది. "అయితే 10 నిముషాల్లో వంట అయిపోతుందా?" "కాదండీ, కాదు. నేను కూడా తమతో హోటలుకి వచ్చేస్తా..."

అలాగే ఇంకోటి జడ్జి గారు, ముద్దాయితో అంటున్నారు. " నువ్వేదైనా చెప్పుకోవలసి ఉంటే, చెప్పు. "

దానికి ముద్దాయి ఏమన్నాడంటే..."ఎలినోరి ముందు నేనేం చెప్పుకోగలనండి. నేను ఆ అయన పెళ్ళాం నగలు ఎత్తుకు పోయేటప్పుడు ఆయన గుర్రుమని గురక పెడుతూ నిద్ర పోతున్నాడు. ఇప్పుడు నన్ను కళ్లారా దొంగిలించడం చూశానంటున్నాడు. పచ్చి అబద్ధం కదండీ. ఇలాంటి అబద్ధం సాక్ష్యం నమ్మి నన్ను శిక్షిస్తారా?"

ఇలాంటివి ఈ పుస్తకం లో 4,5 పేజీలు రాశారు.

ఇలా ఉండేదండీ ఆనంద వాహిని పత్రిక. అది 2,3 పత్రికల వరకూ, అంటే, మాస పత్రికగా ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా వెలువడింది. తరవాత 1930 లోనే ప్రెస్ ఆర్డినెన్స్ అని ఒకటి వచ్చింది. అది పత్రికలకు కాస్త దెబ్బ కొట్టింది. అందుకని ఆనంద వాహిని 1930 జూలై, ఆగస్టులలో ఆగిపోయింది. 1930 అక్టోబర్ లో 7 నుండి 10 సంచికల వరకు ఒకే సంచికగా ప్రచురించారు. దాంట్లో చెప్పారు కూడా "ఈ నడుమ విసరి విసరి వేస్తున్న ప్రెస్ ఆర్డినెన్స్ అనే వడగాల్పు తాకి, మా ఆనంద వాహిని కూడా ఇంత వరకు ఇంకిపోవలసింది "అని రాసారు.

దానికి కారణం కూడా చెప్పారు “1930 మే నెలలో ఆనంద వాహినిలో మేము ఒక రాజకీయ విషయాలు రాశాము. అది గవర్నమెంట్ వారికి నచ్చలేదు. అందుకని ప్రెస్ వాళ్ళు కూడా తరవాత నుంచి మా పత్రికను ముద్రించమన్నారు. అందుకని ఆగిపోయింది” అని.

ఆ రాజకీయ వార్తలు ఏమిటంటే – సాత్వికోద్యమము అనే సంపాదకీయము, గాంధీ మహాత్ముని సత్యాగ్రహం గురించి, గాంధీ గారి ఉద్యమం గురించి, మద్రాస్ ప్రభుత్వం మీద విసుర్లు”. ఇవి ప్రచురించినందుకు గాను ప్రెస్ ఆర్డినెన్స్ మూలంగా ఒక మూడు నెలల పాటు ఈ ఆనంద వాహిని ఆగిపోయింది. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఆనంద వాహినిలో అక్రానందస్వామి, పుణ్యవతి, భాగ్యవతి, మా మేనత్త, ఇలాంటి శీర్షికలన్నీ కూడా “గౌతముడు”అనే పేరుతో వ్రాస్తూ ఉండేవారు. ఒక సంవత్సరం పాటు బాగానే సాగింది. ఆనంద వికటన్ తమిళ పత్రిక అప్పటికే మంచి ప్రజాదరణ తోటి కొనసాగుతున్నది, వాసన్ గారి నేతృత్వంలో. దానితో పాటుగా ఇది కూడా ఆ స్థాయికి రావలసిందే గానీ, ఆ ముద్రణ కొనసాగుతున్న రోజుల్లోనే, వేటూరి ప్రభాకర శాస్త్రిగారు వేరే పనుల వల్ల మద్రాస్ లో ఎక్కువగా వుండలేకపోయే సందర్భం వచ్చింది. అందుకని ఆనంద వాహిని పత్రికకు కావలసిన విషయాలన్నీ ఒక చోట పెట్టి, ఆయన వూరికి వెళుతూ “పత్రిక ముద్రణ సరిగ్గా జరిగేటట్టు చూడండి” అని ఓరియంటల్ లైబ్రరీలో పని చేస్తున్న పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి గారికి అప్పజెప్పి వెళ్లారు.

ఆ రోజుల్లో గవర్నమెంటుకు ఏ మాత్రం వ్యతిరేకంగా రాసినా గానీ, పత్రికల మీద చర్యలు తీసుకుండేవారు. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు లేనప్పుడు ఒక వ్యాసం వచ్చింది. అది ‘ప్రభుత్వానికి వ్యతిరేకంగా వుంది’ అని ప్రభుత్వం భావించింది. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు అప్పుడు లేనప్పటికీ, సంపాదకుడు ఆయనే నైతికంగా ఆయనదే బాధ్యత అనుకున్నారు. అందుకే ఆయనకు అది చికాకు కలిగించింది. “నేను లేకుండా ఇది ఎందుకు వేశారు?”అన్నారు. మొత్తానికి ఈ గందరగోళం వల్ల ఆయన ఆనంద వాహిని సంపాదకత్వం నుండి తప్పుకున్నారు. ఆ తరవాత కూడా ఎక్కువరోజులు నడవలేదు ఆనంద వాహిని.

ఇదండీ – 1930 లో ఒక సంవత్సరం పాటు మాత్రమే నడిచినటువంటి తెలుగులో మొట్ట మొదటి హాస్య పత్రిక “ఆనంద వాహిని” గురించిన సమాచారం. అది కూడా పండిత పుత్రులు వేటూరి ప్రభాకర శాస్త్రి సంపాదకత్వంలో వెలువడింది.

★★★

తరువాత పత్రిక – ఆ రోజుల్లోనే ప్రారంభం అయి సుమారు 10 సంవత్సరాలు నడచిన సాహిత్య మాస పత్రిక “ఆంధ్రభూమి”. ఇటీవల వరకూ “దక్కన్ క్రానికల్“ సంస్థ తరపున వచ్చిన ఆంధ్రభూమి పత్రికకీ, ఇప్పుడు మనం విశేషాలు చెప్పుకోబోతున్న “ఆంధ్రభూమి”కీ పేరులో తప్ప మరింకెందులోనూ సంబంధం లేదు. అలనాటి ఆంధ్ర

భూమి 1933 మే లో ప్రారంభం అయి, 1942 జూలై వరకూ కొనసాగింది. దీనికి సంపాదకుడు ఆంద్ర శేషగిరిరావు గారు.

ఈ ఆంద్ర శేషగిరిరావు గారిని "వీరాంధ్రులు" అనే వాళ్ళు. ఆయనట ఆ రోజుల్లో "ఆంధ్రరాష్ట్రం వచ్చేదాకా సిగ ముడి వెయ్యను"అని చాణుక్యడిలాగా ప్రతిన బూని, శిరోజాలూ, గెడ్డాలూ, మీసాలూ పెంచారట. ఈ పత్రికలో ఆంధ్ర జాతికి సంబంధించిన వివిధ విషయాలను ప్రామాణికంగా, పరిశోధనా దృష్టితో ప్రచురించేవాళ్ళు. ఆయన స్వయంగా సరళ గ్రాంధిక వాది అయినప్పటికీ, గిడుగు రామ్ మూర్తి పంతులుగారి యొక్క వ్యవహారిక ఆంధ్ర భాషా ఉద్యమాన్ని గౌరవిస్తూ ఈ ఆంధ్ర భూమిలో సరళమైన తెలుగులోనే చాలా మటుకు రాసారు.

ఆంధ్ర భూమి రెండవ సంచికలో, 1933 జూన్లో, అప్పట్లో వున్న ప్రసిద్దులందరూ రాశారు. కవికొండల వెంకటరావు గారూ, బొడ్డు బాపిరాజు గారూ, ఊటుకూరి సత్యనారాయణ గారూ, మంగిపూడి వెంకట శర్మ గారూ, పురిపండా అప్పలస్వామి గారూ, ఓలేటి పార్వతీశం గారూ, బుర్రా వెంకట సుబ్బారావు గారూ, సామవేదం జానకీ రామశర్మగారూ వీళ్ళందరూ కూడా ఈ ఆంధ్రభూమిలో రాసారు. "ఇది సాహిత్య, సాంస్కృతిక పత్రిక" అని చెప్పారు. ఆంధ్ర భూమిలో ఉన్న కొన్ని ప్రత్యేకతలు – ఆ రోజుల్లోనే 1933 లోనే అడ్వటైజర్స్ ఇండెక్స్ అంటే, ప్రకటనల యొక్క జాబితా మొట్ట మొదట్లోనే ఇచ్చారు.

వెంకట్రామా &కో వాళ్ళు దేని గురించి ప్రకటించారు? ఏ పుటలో వుంది? కోదండ రామ్ పిళ్ళై గారు ఉత్తమ తరగతి కర్ర సామాగ్రి గురించి 6 వ పుటలో ఇచ్చారు. అమృతాంజనం డిపో వారు, అమృతాంజనం, తామర తైలం గురించి కవరు పేజీలో వేశారు. ఇది ఆ రోజుల్లో ఆంద్ర శేషగిరిరావు గారు ప్రారంభించిన చక్కటి సంప్రదాయం అని చెప్పుకోవాలి.

రచయితల పేర్లు, వేరే వాళ్ళు రాయడం గానీ, అచ్చులో గానీ కాకుండా, వాళ్ళ స్వదస్తూరితో వున్న సంతకాల తోటి వ్యాసాలనీ, అంశాలనీ ప్రచురించడం. కవికొండల వెంకట్రావు గారూ, బొడ్డు బాపిరాజు గారూ, మంగిపూడి వెంకట శర్మ గారూ వీళ్లందరి సంతకాలు ఈ ఆంధ్ర భూమిలో చూడవచ్చు. అవే కాకుండా మధ్య మధ్యలో పూర్తి పేజీ సింగిల్ కలర్ ఫోటోలు కూడా వేశారు. ప్రశాంత రమ్య ప్రదేశము మొదలైనవి. 10 సంవత్సరాలు వెలువడిన ఈ ఆంధ్రభూమి పత్రిక అప్పట్లో ప్రామాణికత గల సాహిత్య పత్రికగా పేరు తెచ్చుకుంది. మిగతా పత్రికల్లగానే 10 సంవత్సరాలు మించి కొనసాగలేదు.

ఈ పత్రికలో కనిపించిన మరొక ఆసక్తికరమైన విషయం– ఆ రోజుల్లో అంటే 1936 ప్రాంతాల్లో ఒక ప్రకటన వచ్చింది "ఆంధ్రజ్యోతి మొల్మేన్ వార పత్రిక. సాలు చందా మూడు రూపాయలు. విడి పత్రిక 9 పైసలు". ఈ ఆంధ్ర

జ్యోతి అనే వారపత్రిక ఆ సంవత్సరాల్లో బర్మా దేశం నుండి వచ్చింది. తెలుగు దేశం నుండి కాదు. బర్మాలో అప్పటికే లక్షా 60 వేల మంది ఆంధ్రులు వున్నారు. వాళ్ళ క్షేమానికి పాటుపడే వార పత్రిక ఈ ఆంధ్ర జ్యోతి.

"ఇందులో కార్మిక సాంఘిక, రాజకీయ , వాణిజ్య విషయాలు నిష్పక్షపాతంగా చర్చించబడును. దీనికి బర్మా అంతటా కూడా ప్రచారం వుంది. వర్తకులు, ఈ ఆంధ్ర జ్యోతిలో ప్రకటనలు ఇస్తే, మంచి లాభం పొందగలరు. వివరములకు, ఎడిటర్ ఆంధ్ర జ్యోతి 185, లోవర్ మెయిన్ రోడ్ మోల్మేన్ అని వ్రాయుడు." అని ఒక ప్రకటన వుంది. ఆసక్తి కరమైన విషయం ఏమిటంటే, ఆంధ్రభూమి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వుంది. ఆంధ్ర జ్యోతి అప్పట్లో బర్మాలో వుంది. ఇప్పుడున్న వాటికీ సంబంధం లేదు గానీ, పేర్ల విషయంలో మాత్రం ఒకటే.

అవి 1930 ప్రాంతాల్లో ప్రారంభమైన కొన్ని పత్రికల వివరాలు.

★★★★

తరువాత అదే రోజుల్లో ప్రారంభమై 90 సంవత్సరాలుగా వెలువడుతున్న ఒక విభిన్నమైన వార పత్రిక గురించి తెలుసుకుందాం. అదే "జమీన్ రైతు". ఆ రోజుల్లో అంటే 1930 ప్రాంతాల్లో వచ్చిన పత్రికలన్నిటికంటే, భిన్న మైన ఆశయాలతో నెల్లూరు కేంద్రంగా స్థానిక పత్రికగా ప్రారంభమైంది "జమీన్ రైతు". ఆ పేరులోనే చాలా విభిన్నత వున్నది. ఆ పేరులోనే ఆశయాన్ని కూడా ప్రతిఫలింప జేశారు దాన్ని స్థాపించిన నెల్లూరు "వెంకట్రామా నాయుడు గారు ".

ఆ రోజుల్లో ఆంధ్రదేశంలో జమిందారులూ, జమీలూ, వ్యవసాయ భూముల్ని సాగుచేసే రైతులూ ఇలా ఉండేది పరిస్థితి. ఆ నేపథ్యంలో రైతులకూ, జమిందారులకూ వారధి లాగా ఒక పత్రికను తీసుకురావాలను కోవడం ఒక సాహసం. చాలా వినూత్నం కూడా. ఎప్పుడూ రైతుల పక్షానే నిలబడి, వాళ్ళ హక్కుల పరిరక్షణ కోసం, జమిందారులతో సంప్రదించడం, అవసరమైతే ఆందోళన వరకూ వెళ్లడం, ఇలా ముఖ్యమైన ఆశయాలతో కొనసాగింది మొట్ట మొదటినుండి.

ప్రారంభంలో పత్రిక పేరు జమిందారీ రైతు. "నెల్లూరు జిల్లా జమిందారీ రైతుల పక్షమున ప్రతి ఆదివారము ప్రకటింపబడును." అని రాశారు. ఇంకా తమ పత్రిక గురించి, స్థాపకులు ఏం చెప్పారంటే, "ఇందు రైతుల హక్కు బాధ్యతలు , వ్యవసాయమూ, విద్యా, ఆర్థిక పరిస్థితులూ, వాని అభివృద్ధికి కావలయు మార్గములు మున్నగు విషయములు చర్చించబడును. సంవత్సర చందా 4 రూపాయలు."

ఆంధ్ర దేశములోని 14 జిల్లాలలోని అందరి రైతులకూ ప్రాతినిధ్యం వహిస్తూ ఉండేది. మొదట్లో కొన్ని సంచికల్ని కొన్నిటిని పరిశీలిస్తే, మునగాల, వెంకటగిరి, చల్లపల్లి, నూజివీడు, ముత్యాల ఇట్లా అన్ని జమీల నుండి వార్తలను సేకరించి, ఈ పత్రికలో వేస్తూ ఉండేవారు.

ఒక ఉదాహరణ చెబుతాను. మొట్ట మొదటి సంచికలోనే "మునగాల జమీ రైతుల దుర్భర స్థితి." అని 'మునగాల జమీందారుల దగ్గర పనిచేస్తున్న రైతుల పరిస్థితి ఎలా వుందో' ఎంత ధైర్యంగా రాసారో చూడండి.

"మునగాల జమీ గ్రామములన్ని కూడా గవర్నమెంట్ వాళ్ళు సర్వే చెయ్యలేదు. జమీందారు గారే స్వయంగా సర్వే చేయించుకున్నారు. గవర్నమెంట్ వాళ్ళు న్యాయంగా కట్టాల్సిన శిస్తు ఎకరానికి 4 రూపాయలు అయితే, జమీందారు గారు 6 రూపాయలుగా వేయించుకున్నారు. నిర్బంధం మీద భరింపరాని దుష్ట షరతులను పట్టా ముచ్చి కాలలో వ్రాయించి, విద్యా వాసన లేని రైతులను చీటికీ మాటికీ కోర్టులకు తిప్పుట. జమీ గ్రామాదులలో, ఒక్క రాజాగారి నివాస స్థలమైన "నడి బూడెం "గ్రామం లో తప్ప మిగతా గ్రామాల్లో ఎలిమెంటరీ పాఠశాలలు లేకుండా చేయుట."

ఇలాంటి దారుణమైనటు వంటి పరిస్థితులన్ని కూడా పత్రిక ద్వారా తెలియ జేయడం, అవసరమైతే జమీందారుల దగ్గరకు వెళ్లి, రైతుల పక్షాన పోరాడి, వాళ్ళ హక్కుల్ని సాధించి పెట్టడం. ఇది చాలా సాహసోపేతమైన చర్య. పత్రిక అంటే, కేవలం వార్తలని మాత్రమే ప్రచురించి ఊరుకోవడం కాకుండా,  ఇలాంటి వన్నీ  సాధించడానికి నడుం కట్టాము అని మొట్ట మొదట్లోనే వెంకట్రామా నాయుడు గారు చెప్పుకున్నారు. అలాగే చేశారు కూడా.

1934 నుండి ఈ "జమిందారీ రైతు" అన్న పేరును "జమీన్ రైతు" గా మారింది. దాదాపుగా మొట్ట మొదటి 20 సంవత్సరాలు పత్రికను ప్రారంభించిన వెంకట్రామా నాయుడు గారే సంపాదకులుగా వున్నారు. ఆ తరువాత "నెల్లూరు శ్రీరామ్ మూర్తి గారూ" , ప్రస్తుతం నెల్లూరు డోలేంద్ర ప్రసాద్ గారూ సంపాదకులుగా వున్నారు. మొట్ట మొదటి నుండి కూడా రైతు వార్తలూ, రైతుల సంక్షేమంతో పాటుగా సాహిత్యపరమైన అంశాలు కూడా ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది ఈ "జమీన్ రైతు". కథలూ, కవితలూ, సీరియల్సూ వీటితో పాటుగా సినిమా వార్తలు కూడా ప్రముఖంగా పబ్లిష్ చేస్తూ ఉండేవారు. ఆనాటి ప్రముఖ రచయతలు బెజవాడ గోపాల్ రెడ్డి గారూ, రాయప్రోలు సుబ్బారావు గారూ, ఆత్రేయ గారూ, దువ్వూరి రామిరెడ్డి గారూ, గుర్రం జాషువా గారూ ఇలాంటి వాళ్ళందరూ కూడా ఈ 'జమీన్ రైతు' లో రచనలు చేస్తూ ఉండేవారు.

అలాగే ఈ జమీన్ రైతు లో కేవలం ఇప్పుడు చెప్పుకున్న వార్తలే కాకుండా, వర్తమాన రాజకీయాల గురించి, ముఖ్యంగా అప్పట్లో జరుగుతున్న స్వాతంత్ర పోరాటం, ఉప్పు సత్యాగ్రహం, ఇలాంటి వాటి గురించి కూడా ప్రముఖంగా రాస్తూండేవారు. ఆ తరువాత తెలుగు సినిమాలు ప్రారంభం అయ్యాక, తెలుగు టాకీ సినిమాల గురించి కూడా విశ్లేషిస్తూ రాస్తూండేవారు. ఇప్పటికి కూడా మీరు జమీన్ రైతు వెబ్ సైట్ కి వెళితే, ఆ పాత పత్రికలన్నీ చూస్తే, వాళ్ళు ఎంత ప్రామాణికతతో నడుపుతూ వచ్చారన్న విషయం తెలుస్తూ ఉంటుంది. కాలక్రమేణా కొన్ని అభిరుచులూ, యాజమాన్యం ధోరణులూ మారుతూ రావడం అనేది వేరే విషయం అనుకోండి.

ఈ జమీన్ రైతు పత్రిక గురించి చెప్పుకునేటప్పుడు తప్పనిసరిగా ప్రస్తావించు కోవాల్సిన మరో అంశం ఏమిటంటే, ఈ పత్రిక గత 90 సంవత్సరాలుగా నిరాఘాటంగా కొనసాగడం ఒక రికార్డు అయితే, ఈ పత్రిక పాత సంచికలన్నిటినీ కూడా, ప్రస్తుత వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచడం. 90 సంవత్సరాల ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ముఖ్యమైన ఘట్టాలను అతి సులువుగా తెలుసుకోవాలంటే, జమీన్ రైతు వెబ్ సైటు అత్యంత సౌకర్యవంతంగా ఉంటుంది. ఇవండీ జమీన్ రైతు విశేషాలు.

★★★★

ఆ తరువాత వరస క్రమంలో మనం విశేషాలు తెలుకోబోయే పత్రికలు "సందర్శిని" "ప్రజా మిత్ర". ఈ పత్రికలు ఒక వర్గానికి చెందిన పత్రికలు అని చెప్పుకోవచ్చు. ఆ వర్గం ఏమిటంటే, ఆ రోజుల్లో ప్రారంభం అయి, కొద్ది సంవత్సరాలు కొనసాగిన రాజకీయ పార్టీలకు అనుబంధంగా,ఈ పత్రికలు వచ్చాయి. "జస్టిస్ పార్టీ" కి అనుబంధంగా " సందర్శినీ, ప్రజామిత్ర పార్టీ కి అనుబంధంగా "ప్రజామిత్ర " పత్రికలు. ఇవి 1930-40 ప్రాంతాల్లో వెలువడిన పత్రికలు. ఇవి రాజకీయ పార్టీలకు అనుబంధంగా ప్రారంభం అయినప్పటికీ, కేవలం పార్టీ వార్తలకు పరిమితం కాకుండా, తెలుగు సాహిత్యానికి పెద్ద పీట వెయ్యడం అనేది వాటి ప్రత్యేకత.

అందుకు కారణం కూడా ఉందండీ - వాటికి సారధ్యం వహించిన వాళ్ళు తెలుగు సాహిత్యం లో నిష్ణాతులు కావడం. వాళ్ళే తాపీ ధర్మారావు గారూ. గూడవల్లి రామబ్రహ్మం గారూ. తెలుగు సాహిత్యంతో ఏ కొంచెం పరిచయం వున్న వాళ్ళకైనా తాపీ ధర్మారావు గారి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తాపీ ధర్మారావుగారు స్వయంగా రచయత. అప్పటికే చాలా పుస్తకాలు రాశారు. తరవాత రోజుల్లో ఆయన రచయితగా కొనసాగడమే కాకుండా, సినీ రచయితగా కూడా కొనసాగారు. ఇంకా తేలిగ్గా గుర్తు పట్టాలంటే, రోజులు మారాయి, రాముడు-భీముడు లాంటి సూపర్ హిట్ చిత్రాలను అందించిన తాపీ చాణక్య గారు, తాపీ ధర్మారావు గారి అబ్బాయే.

అలాగే తెలుగు చలనచిత్ర రంగపు తొలి దశాబ్దాలతో పరిచయం వున్న వాళ్ళు ఎవరికైనా గానీ గూడవల్లి ,రామబ్రహ్మంగారి గురించి తెలిసే ఉంటుంది. మాలపిల్ల, రైతుబిడ్డ లాంటి అభ్యుదయ చిత్రాలను అందించారు. తాపీ ధర్మారావు గారూ, గూడవల్లి రామ బ్రహ్మం గారూ వీరిద్దరూ 90 సంవత్సరాల క్రిందటే తెలుగు వార్తా పత్రికల్లోనూ, సాహిత్యానుబంధాల్లోనూ కొత్త దారులు వేశారు అనడంలో ఏమాత్రం అతి శయోక్తి లేదు.

వివరాల్లోకి వెళితే, 1920 ప్రాంతాల్లో బ్రాహ్మణేతర ఉద్యమం ప్రారంభం అయింది. దాంట్లో నుండి రూపుదిద్దుకున్న రాజకీయ పార్టీ "జస్టిస్ పార్టీ". బొబ్బిలి రాజా, మీర్జా పూర్ రాజా, చల్లపల్లి రాజా వీళ్ళందరూ ఈ జస్టిస్ పార్టీ లో క్రియాశీలకంగా ఉండేవారు.

జస్టిస్ పార్టీకి చెందిన "ముని స్వామి నాయుడు "అనే ఆయన అప్పట్లో మద్రాస్ రాష్టానికి ప్రధాన మంత్రిగా ఎన్నిక అయ్యారు. 1930 ప్రాంతాల్లో రాష్టానికి ముఖ్యమంత్రులనే ప్రధాన మంత్రి అనేవాళ్ళు. ఈ నేపథ్యంలో జస్టిస్ పార్టీ తమ ఆశయాల ప్రచారం కొరకు "సమదర్శిని"అనే దినపత్రికను ప్రారంభించారు. అది 1928 ప్రాంతాల్లో ప్రారంభం అయింది. మొట్ట మొదట్లో దినపత్రిక, తరవాత వారానికి రెండు సార్లూ వస్తూ ఉండేది. ఈ పత్రికకు "పింజల సుబ్రమణ్య శెట్టి"అనే ఆయన పబ్లిషర్ అనీ, "గానాల రామ్మూర్తి"అనే ఆయన సంపాదకుడు అనీ, ముఖ చిత్రం మీద కనిపిస్తూ ఉంటుంది.

పేరుకి గానాల రామ్మూర్తి అని ఉన్నప్పటికీ అసలైన సంపాదకుడు తాపీ ధర్మారావుగారు. తాపీ ధర్మారావు గారి నేపథ్యం, జీవిత గమనం, చాలా ఆసక్తికరంగా, స్ఫూర్తి దాయకంగా ఉంటుంది. ఈ సందర్భంలో తాపీ ధర్మారావు గారి గురించి చెప్పుకోవాలంటే... తాపీ ధర్మారావు గారు బొబ్బిలి రాజా వారికి సెక్రెటరీ గానూ, కొంత కాలం మేనేజర్ గానూ పని చేశారు. ఆ అనుభవం వుంది కాబట్టి, ఆయన సిఫార్సుతో, సమదర్శని పత్రికకు సంపాదకత్వం భాద్యతలు స్వీకరించారు. తాపీ ధర్మారావు గారి ఆధ్వర్యములో ఈ సమదర్శిని పత్రికలో సమకాలీన రాజకీయ వార్తలతో పాటుగా అనేక సాహిత్యపరమైన అంశాలు కూడా చోటు చేసుకున్నాయి.

అప్పటి ప్రముఖ రచయతలైన ముద్దు కృష్ణ గారూ, పురిపండ గారూ.. ఇలాంటి వాళ్ళందరూ కూడా సమదర్శినిలో వ్రాస్తూ ఉండేవారు. శ్రీ పాద సుబ్రమణ్య శాస్త్రి లాంటి వాళ్ళు కూడా ఈ బ్రాహ్మణేతర ఉద్యమలోని మంచిని ఎత్తి చూపిస్తూ.. "ఈ ఉద్యమాన్ని మనం ఎందుకు సమర్ధించ కూడదు?"అని వ్యాసాలు కూడా వ్రాసారు. ఈ పత్రికలో పరిశోధనాత్మక వ్యాసాలు వ్రాస్తూండేవాడు ఒక యువకుడు. ఆయనే కొంత కాలానికి సమదర్శినిలో ఉపసంపాదకుడిగా చేరాడు. ఆయనే గూడవల్లి రామ బ్రహ్మం గారు.

రామబ్రహ్మం గారు ఆరోజుల్లో జాగర్లమూడి కుప్పుస్వామి గారు పురమాయించిన పని మీద మద్రాస్ లో ఉండి పరిశోధనా పత్రాలు వ్రాస్తూ ఉండేవారు. ఆ పరిచయంతో ఈ పత్రికలో ఉపసంపాదకుడిగా చేరారు. తాపీ ధర్మారావు గారూ, గూడవల్లి రామ బ్రహ్మం గారూ వీరిద్దరి కలయికలో "సమదర్శిని " ఆ రోజుల్లో పాఠకుల్లోకి విపరీతంగా చొచ్చుకు వెళ్ళింది. 'ఆంధ్రపత్రిక వార్షిక సంచిక వచ్చేది' అని గతంలో మనం ప్రస్తావించుకున్నాం కదా! దాని అడుగు జాడల్లో నడుస్తూ ఈ సమదర్శిని కూడా "ఉగాది ప్రత్యేక సంచిక "అని ఎక్కువ పేజీలతో వెలువరించేవారు.

ఒక ఉగాది సంచిక మీకు పరిచయం చేస్తాను. 1928 లో వచ్చినటువంటి సమదర్శిని విభవ సంవత్సరాది సంచిక దాదాపుగా 185 పేజీలు వుంది. దీని మొదటి పేజీలో "కీర్తి శేషులైన దివాన్ బహద్దూర్ కిట్టి త్యాగరాయ శెట్టి K . T గారి దివ్య స్మరనార్ధము ప్రచురించబడినది. పత్రికాధిపతి పింజల సుబ్రమణ్య శెట్టి గారు, సంపాదకుడు గానాల రామ్మూర్తి గారు" అని వుంది. ఇందులో వ్రాసిన ప్రముఖుల్ని చూస్తే దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరావు

పంతులుగారూ, అలాగే శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారూ, అడవి బాపిరాజుగారూ, విశ్వనాథ సత్యనారాయణగారూ, కోలవెన్ను రామ కోటేశ్వరావుగారూ, పింజల సుబ్రహ్మణ్యంగారూ, చల్లా శేషగిరిరావుగారూ.. ఇలా అప్పట్లో వున్న ప్రముఖులందరూ కూడా ఈ సమదర్శనిలో రాశారు.

దీనికి కారణం, వాళ్ళందరి తోటి తాపీ ధర్మారావు గారికి వున్న పరిచయాలు, తాపీ ధర్మారావు గారి మీద వాళ్లకి వున్న గౌరవమూ. అలాగే తాపీ ధర్మారావు గారు సమ దర్శినిని కేవలం జస్టిస్ పార్టీకి అనుబంధంగా కేవలం రాజకీయ వార్తలకే పరిమితం చేయకుండా, 'ఉత్తమైన సాహిత్య వ్యాసాలను కూడా చేర్చాలి. సాహిత్య ప్రక్రియలను కూడా చేర్చాలి' అని ఈ ప్రత్యేక సంచిక గురించి ప్రకటించారు.

1933 ప్రాంతాల్లో తాపీ ధర్మారావుగారు వేరే ఉద్యోగం మీద మద్రాస్ వదలి వెళ్లాల్సి రావడంతో, గూడవల్లి రామ బ్రహ్మం గారు సమదర్శినికి సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించారు. రామబ్రహ్మం గారు ముక్కు సూటి మనిషి. ఎవరికీ భయపడే రకం కాదు. తాను న్యాయం, ధర్మం అని నమ్మిన వ్యాసాల్ని పత్రికలో ప్రచురించడానికి ఏమాత్రం వెనుకంజ వేసేవారు కాదు. ఆ తత్వమే గూడవల్లి రామబ్రహ్మం గారికీ, జస్టిస్ పార్టీ నాయకుడైన మును స్వామి నాయుడుకీ మధ్య విబేధాలు రేపింది. అందుకని సమదర్శిని లో 3,4 సంవత్సరాలు పనిచేసి రాజీనామా చేశారు.

ఆ తరువాత జస్టిస్ పార్టీలో వచ్చిన చీలికలు మూలంగా సమదర్శిని ఎక్కువ కాలం కొనసాగలేదు. మొత్తంగా చూసుకుంటే ఈ సమ దర్శని పత్రిక 1927 నుండి 1935, 36 వరకూ నడచి ఉండవచ్చు.

ఇవి సమదర్శని పత్రిక విశేషాలు.

ఇక మరో పత్రిక "ప్రజామిత్ర" మరి కొన్ని పత్రికల గురించి ... తరువాత భాగంలో ....

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 సెప్టెంబర్ 2 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS